కె. సి.వి. సుబ్బారావు

## సామాజిక శాస్త్రవేత్త, పౌరహక్కుల నాయకుడు

# సి. వి. సుబ్బారావు సంస్మరణ సభ

5-2-1994 సాయంకాలం 5 గం॥ల 30 ని॥కు

సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ ఆవరణలో
( నిజామ్ అబ్జర్వేటరీ - అమీర్‌పేట చౌరస్తానుంచి బేగంపేట వెళ్ళే దారిలో )

---

వక్తలు : ప్రొ॥ R S. రావు, ప్రొ॥ D. N రెడ్డి, ప్రొ॥ రాధాకృష్ణ, వరవరరావు, ఓల్గా, వింధ్య, బాలగోపాల్, సురేష్.

---

పౌరహక్కుల ఉద్యమంలో దాదాపు 15 సం॥లు చురుకైన పాత్ర నిర్వహించి విలువైన సంప్రదాయాలు నెలకొల్పిన సి వి. సుబ్బారావు జనవరి 17 రాత్రి ఢిల్లీలో గుండెపోటుతో మృతిచెందారు. ఆంధ్రరాష్ట్రానికి చెందిన సుబ్బారావు ఢిల్లీలోనున్న పీపుల్స్ యూనియన్ ఫర్ డెమొక్రాటిక్ రైట్స్ (PUDR) వ్యవస్థాపక సభ్యుడు. చనిపోయేనాటికి ఆ సంస్థ కార్యదర్శి.

PUDR ఏర్పాటుతో భారతదేశ పౌర హక్కుల ఉద్యమంలో 70వ దశకంలో పుట్టిన నూతన ధోరణి ఢిల్లీకి విస్తరించింది. అప్పట్లో చాలా మంది, ప్రత్యేకించి ఢిల్లీలో పౌర హక్కుల సంస్థలు కేవలం రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను కాపాడటమే లక్ష్యంగా ఎంచుకోవాలని అనేవారు ఇందుకు భిన్నంగా PUDR ఏర్పాటుకు చొరవతీసుకున్న సుబ్బారావు విభిన్న రూపాల్లో సామాజిక, ఆర్థిక ఆధిపత్య వర్గాలకింద నలిగిపోతున్న పేదప్రజలు జీవితంలో సుఖ సంతోషాల్ని పెంపొందించుకోవటానికి, కనీస జీవన ప్రమాణాలను సాధించుకోవటానికి పోరాటంచేసే హక్కును కలిగి ఉంటారని; ఆ హక్కును కాపాడటమే పౌరహక్కుల సంఘాల ప్రధాన లక్ష్యమని వాదించాడు. అంటే ఆదేశిక సూత్రాలను, ప్రాథమిక హక్కుల్లో భాగంగా చూడాలన్నాడు ఆ విధంగా 70 దశకంలో దేశంలో పౌరహక్కుల ఉద్యమంలో తలెత్తిన నూతన ధోరణి సుబ్బారావు చొరవవల్ల PUDR రూపంలో వ్యక్తీకరించబడింది.

ఢిల్లీ వంటి మహానగరంలో సాధారణ ప్రజానీకంపై ప్రజా ఉద్యమాలపై, దేశంలోని విభిన్న ప్రాంతాల్లో సాగుతున్న అణచివేతను ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, పత్రికలు ఎన్నడూ పట్టించుకోలేదు సుబ్బారావు చొరవతో PUDR మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు, ప్రజా ఉద్యమాల పౌరహక్కుల అణచివేతకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ప్రచారం చేసింది. ఆసియాడ్ గ్రామాన్ని కట్టిన కూలీల బానిసత్వం, బీహార్ గని కార్మికుల కనహీన పని స్థితిగతులు, బస్తర్ ఆదివాసులను అభివృద్ధి క్రమం నిర్వాసితులను చేసిన వైనం, బీహార్, ఆంధ్రా విప్లవకారులపై రాజ్య యంత్రాంగం అమలు చేస్తున్న అణచివేత చర్యలు, వంటి విషయాలు సుబ్బారావు చొరవతో PUDR వేదిక నుండి వెలుగులోనికి వచ్చాయి. ప్రత్యేకించి APCLC పైన నిర్బంధం వచ్చినప్పుడల్లా

P.T.O

ఢిల్లీ విశ్వవిద్యాలయానికి, ఢిల్లీ నగరంలోని ఇతర సంస్థలకూ చెందిన మేధావుల అభిప్రాయాలను సమీకరించి రాష్ట్ర ప్రభుత్వంపైన ఒత్తిడి పెట్టడానికి PUDR చేసిన కృషిలో సుబ్బారావు చొరవ చాలా ఉంది.

సుబ్బారావు పౌరహక్కుల ఉద్యమకారుడు మాత్రమే కాదు. విద్యార్థిగా ఉన్నప్పుడు విప్లవ విద్యార్థి ఉద్యమాలలో చాలా కృషిచేసాడు. ఆయన రాడికల్ విద్యార్థి సంఘం వ్యవస్థాపక సభ్యుడు, మొదటి ఉపాధ్యక్షుడు. ఎమర్జెన్సీలో జైలులో ఉండి M.A పూర్తి చేసాడు. విప్లవ రచయితల సంఘం ఆవిర్భావానికి ప్రేరణ అయిన "విశాఖ విద్యార్థుల"లో ఆయన ఒకరు. చాలాకాలం విరసం సభ్యుడు సృజన "సాహితీ మిత్రుల"లో ఒకనిగా ఆ పత్రిక ప్రమాణాలను నిర్దేశించడానికీ నిలబెట్టడానికీ చాలా కృషి చేసాడు. సాహిత్య పాఠకులకు "సురా"గా పరిచితులు.

ఈశాన్య భారతదేశములోని ఉద్యమాల గురించి "వేర్పాటు వాదం, విచ్ఛిన్నకారుల కుట్రలు" అని ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్న దశలో ఆ ఉద్యమాల నేపథ్యాన్ని, వాటిలో ఇమిడి ఉన్న జాతి సమస్యను వివరిస్తూ "రగులుకున్న రాక్షసిబొగ్గు" అనే ఆలోచనాత్మకమయిన రచన చేసారు. సాహిత్యాన్ని సాహిత్య ప్రమాణాలతో కొలిచే విధానానికి భిన్నంగా, సామాజిక నేపథ్యంలో చూసే ప్రయత్నానికి సుబ్బారావు రూపం ఇచ్చారు. ఆయన సంపాదకత్వంలో వెలువడిన "విభాత సంధ్యలు" ఈ నేపథ్యంలో తెలుగుసాహిత్య విమర్శకు కొత్త ద్వారాలు తెరిచింది. మార్క్సిస్టు ఆర్థిక శాస్త్రాన్ని సులభంగా పరిచయం చేస్తూ తెలుగులో 'రాజకీయార్థిక శాస్త్రం-ఒక విశ్లేషణ' అనే ప్రామాణిక రచన చేశారు. పౌరహక్కుల నివేదికలను సామాజికశాస్త్ర ప్రమాణాలకు తగినట్టు రాసే సాంప్రదాయాన్ని సుబ్బారావు ప్రవేశపెట్టాడు హైదరాబాద్ సంస్థానంలో పారిశ్రామికాభివృద్ధిమీద ఆయన చేసిన పరిశోధన ఇంగ్లీషులో పుస్తకంగా రానుంది. చైనా ఆర్థికాభివృద్ధి సమస్యలపై కూడా ఆయన పరిశోధన చేశాడు. సామాజిక శాస్త్రాల్లో ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల దృష్టినుంచి సామాజిక సమస్యలను విశ్లేషించాలని ఆయన భావించాడు.

రీసర్చి పనులమీద 1984 నుంచి రెండేళ్ళపాటు సుబ్బారావు హైదరాబాదులో ఉన్నాడు. ఆ కాలంలో ఆయన APCLCలో విరసంలో చురుకైన కార్యకర్తగా పనిచేశాడు, ఆ కాలంలోని వివిధ సామాజిక సమస్యలపై మేధావుల మధ్య చర్చ రేకెత్తించటానికి, కార్యకర్తలకు, మేధావులకు మధ్య సంబంధాలను పెంపొందించటానికి సమీక్షావేదిక అనే చర్చావేదికను నిర్వహించాడు.

రచయిత, ఆలోచనాపరుడు, పౌరహక్కుల ఉద్యమకారుడు, సమాజంలోనేకాక వ్యక్తిగత జీవితంలోనూ ప్రజాతంత్ర సంస్కృతి ఉండాలని కాంక్షించిన ప్రజాస్వామిక వాది అయిన సి. వి. సుబ్బారావు 40 ఏళ్ళకే మరణించడం ఆయన స్నేహితులకే కాక దేశంలోని ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటు

—ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం.

—విప్లవ రచయితల సంఘం.

—ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్స్ అసోసియేషన్.

—జనవాహిని.